# నరమేధం

## చిత్తూరి కోటేశ్వరరవు

"పోలీసోళ్ళ జీపులు ఊర్లో కొచ్చినాయి.
నాయాళ్ళు బిలబిలమంటూ జీపులు దిగి ఊరు చుట్టుముట్టినారు.
ఊరి మధ్య తుపాకులతో గస్తీ తిరగతున్నరు.
మగాళ్ళు బయటకు రావడానికి జంకుతున్నరు.
ఆడోళ్ళు నీళ్ళట్టు కోడానికి వణుకుతున్నరు ..."

అది ఆ చీటీలో వున్న సారాంశం.

"ఒరి మల్లిగా, పోలీసోళ్ళు గుడిశె గుడిశెకి తిరుగుతుండరు. నువ్వు జర జాగరతగుండాల్న ..." చీటి తెచ్చి ఇచ్చిన ముసలయ్య మల్లయ్య శ్రేయస్సు కోరి చెప్పాడు.

తను వుండవలసిన జాగ్రత్తలో తను వుండనే వున్నాడు. అయినా అతను అంతగా నొక్కి చెప్పడంతో భారంగా నిట్టూర్చి, అతని భుజం మీద చేయివేసి ఇక వెళ్ళమన్నట్టు సైగ చేశాడు.

ముసలయ్య ఇంటిముఖం పట్టాడు.

"గత రాత్రి మందుపాతర పేలి ఏడుగురు పోలీసులు మరణించారు. --- దళానికి చెందిన మల్లయ్యే ఈ కిరాతకానికి పాల్పడినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు ..." అది ఆ రోజు పేపర్లో వచ్చిన తాజా వార్త.

అప్పటి నుండి మల్లయ్య పోలీసుల హిట్‌లిస్ట్‌లో చేరిపోయాడు.

అతని కోసం పోలీసుల వేట ప్రారంభమయింది. కాని మల్లయ్య ఆ గ్రామంలో లేదు.

తను ఏర్పరచుకున్న రహస్య స్థావరంలో వున్నాడు. ఆ స్థావరం దట్టమైన నల్లమల అడవుల్లో వుంది. అసలు మల్లయ్య అడవికి ఎందుకు పోయినట్టు? రహస్య స్థావరాన్ని ఎందుకు ఏర్పాటు చేసుకున్నట్టు?

అది తెలుసుకోవాలంటే మల్లయ్య గతాన్ని చదవాల్సిందే!

** ** **

మల్లయ్య వ్యవసాయ కూలీగానే ఆ గ్రామంలో రోజులు గడువుకు పోతున్నాడు.




అతనికి తండ్రి, ఓ అక్క వున్నారు. అక్క పేరు రుక్కమ్మ. పెళ్ళి అయిన మూడు రోజులకే ఆమె భర్త పాము కరిచి చనిపోయాడు.

తండ్రి శీతయ్య రుక్కమ్మ పెళ్ళికి తన ఐదు ఎకరాల పొలాన్ని పటేలు దగ్గర తాకట్టు పెట్టి తెచ్చిన పదివేలు అప్పు అప్పుగానే మిగిలిపోయింది.

శీతయ్య అప్పు చెల్లించకపోవడంతో పటేలు అసలు, వడ్డీ కింద అతని పొలాన్ని స్వాధీనపరచుకున్నాడు. శీతయ్య, మల్లయ్యలను ఆ పొలంలోనే కూలీలుగా పెట్టుకున్నాడు.

పటేలు భూకామందే కాదు. వడ్డీ వ్యాపారం చేస్తూ ఆ వూరి ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పిచేస్తున్నాడు. అతనికి ఒక్క డబ్బు కాంక్షే కాదు, సర్వ లక్షణాలు వున్నాయి. అందమైన ఆడది కనబడితే చాలు అతని మనసు కళ్ళెం లేని గుర్రంలా పరిగెడుతుంది. కొందరు నిస్సహాయులను తన అధికార దర్పంతో, మరికొందరు అమాయకులను మాయమాటలు చెప్పి మోసం చేశాడు.

పటేలు కళ్ళు రుక్కమ్మ మీద పడ్డాయి.



రుక్కమ్మకు మాయమాటలు చెప్పి, పెళ్ళి చేసుకుంటానని నమ్మించి వలలో వేసుకున్నాడు.

రుక్కమ్మ నెలతప్పింది. ఆ తరువాత పటేలు ఆమె ముఖం చూడలేదు. ఆమె జరిగింది ఎవ్వరికీ చెప్పుకోలేక పొలంలో వున్న వ్యవసాయ బావిలో దూకి ప్రాణం తీసుకుంది.

పోలీసులు గ్రామానికొచ్చారు. ఆ గ్రామ ప్రెసిడెంటు పటేలే. అతను చెప్పింది రాసుకుని ఫైల్ క్లోజ్ చేసుకుని తమ దారిన తాము వెళ్ళారు.

రుక్కమ్మ శవం ఒకవేపు, చలనహీనంగా తండ్రి మరో వేపు పడి వున్నారు. ఆ దృశ్యం చూసి మల్లయ్య కడుపు తరుక్కుపోయింది.

గాంధీ ఈ దేశానికి స్వరాజ్యం తెచ్చినాడని తను విన్నాడు. కాని ఈ వూర్లో మాత్రం పటేలు ఇంకా జులుం చూపిస్తున్నాడు. ఎందుకు? ప్రశ్న మొలకెత్తింది. ఆలోచన మొదలైంది. పటేలు పల్లె జనాన్ని పీడిస్తున్నాడని అర్థమయింది.

ఎలా? ఎలా? పీడ పీడ ఎలా విరగడచేయాలి? ఈ గ్రామ ప్రజలకు ఎప్పుడు నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లభిస్తాయి? ఆలోచిస్తున్నాడు మల్లయ్య. సరిగ్గా అదే క్షణంలో మల్లయ్య చిన్ననాటి నేస్తం నరసింహ అతని భుజమ్మీద చేయివేశాడు.

"ఓరి మల్లిగా! ఈ కోర్టులు, ఈ చట్టాలు మనలాంటి గిరిజనులకు న్యాయం చేయలేవురా! అందుకే చానమంది ప్రజాకోర్టులు పెడుతున్న అన్నలను ఆశ్రయించార్రా. నువ్వు కూడా అన్నలని ఆశ్రయిస్తే ...." తనకు తోచిన సలహా ఇవ్వజూశాడు నరసింహ.

"ఓరి నియవ్వ! వాళ్ళెవరో ప్రజా కోర్టులెడతారని మనకి న్యాయం చేస్తరని మనం చేతులు ముడుచుక్కూర్చోవాలా? నాయాల్ని మనం తెగ నరకలేమంటావా?" మల్లయ్య ఆవేశంతో వూగిపోతున్నాడు.

"అట్టనే, అట్టనే చేద్దాం ... నువ్వు వూ అను ఈ రోజునే మనబోటి పోరగాళ్ళను, ఈ తండా నుంచి లాక్కొత్తాను. పటేలు పని పట్టొచ్చు. ఆ ఎన్క మనల్ని పీల్చి పిప్పి చేస్తున్న దళారీల పని కూడా పట్టొచ్చు" అన్నాడు నరసింహ మరింత ఉత్సాహంగా.

"అయితే నేను అడవిలో స్థావరం జూస్తాను, నువ్వు ఊర్లకెళ్ళి పోరగాళ్ళను, జర నిలబడేటోళ్ళను పట్టుకరా ..." మల్లయ్య హుషారు జేశాడు.

నరసింహ లుంగీ మడచి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ ఊర్లోకి వెళ్ళాడు.

** ** **

ఆ వార్త ఆ గ్రామంలో గుప్పుమంది.

జనం తండోప తండాలుగా వచ్చి చూసి పోతున్నారు.

ఎవ్వరి నోట విన్నా "అయ్యో పాపం" అన్న మాటే వినిపిస్తోంది, ఆ నోట ఆ నోట ఆ వార్త పటేలు చెవిన పడింది.

అతను నమ్మలేదు.

ఒకవేపు అది నిజం కాదని తనకి తాను ధైర్యం చెప్పుకున్నాడు. అయినా లోపల కంగారుగానే వుంది.

పరుగు పరుగున తన పొలంకేసి పరిగెత్తాడు.

అక్కడ కనిపిస్తున్న శవాన్ని చూసి అవాక్కయ్యాడు.

ఎక్కడో పట్నంలో చదువుతున్న తన కూతురేమిటి – వ్యవసాయ బావిలో శవంగా తేలటమేమిటి?

క్షణం ఆలోచించగానే పటేలుకి ముచ్చెమటలు పట్టాయి.

గతంలో రుక్కమ్మ కూడా అదే బావిలో శవమై తేలింది. అంటే ... అంటే ఈ దారుణం వెనుక ... మల్లయ్య హస్తం వుంది.

పోలీసు ఇన్‌స్పెక్టరు వేసే ప్రశ్నలకి జవాబు చెప్పలేక మౌనంగా వుండిపోయాడు పటేలు.

తన అనుమానం ఎవరిమీదో చెప్పాలి. అంటే తన పాత కథ అంతా విరగతోడాలి. దానివలన తన పరువు బజారున పడుతుంది. అందుకే మౌనం వహించాడు. ఆ మౌనం వెనుక వున్న అతని ఆలోచన ఇటు పోలీసులకి గాని, అటు ప్రజలకి గాని అర్థం కాలేదు.

ఒక్కగానొక్క కూతురు చనిపోయిన షాక్‌లో వున్నాడని సరిపెట్టుకున్నారు.

కాని ఆ వెనుకే అతను పెద్ద వ్యూహం పన్నాడని ఎవ్వరికీ తెలియదు.

** ** **

సరిగ్గా సూర్యుడస్తమిస్తుండగా ఆ వూరిలో మరోసారి కలకలం బయలుదేరింది.

వ్యవసాయ బావిలో ఈసారి ఓ మగాడి శవం తేలింది.

– అది నరసింహ శవం.

** ** **

లోకంలో జరుగుతున్న దారుణాలతో తనకేమీ ప్రమేయం లేనట్టు సూర్యుడు తూర్పున యథావిధిగా ప్రకాశించాడు.

సూర్యకిరణాలు ముఖం మీద పడుతుండగా మల్లయ్యకి మెలకువ వచ్చింది.

అప్పటికే ఆ స్థావరాన్ని పోలీసులు చుట్టుముట్టారు. మల్లయ్యతో పాటు అతని సహచరులందర్నీ పోలీసులు తమ అదుపులోనికి తీసుకున్నారు.

** ** **

పోలీస్ వ్యాన్ బయలుదేరింది.

మామూలుగా చాలాసార్లు పోలీసు జీపులు, వ్యానులు హడావిడిగా బయలుదేరటం జరుగుతుంది. దానిలో వింత ఏమీ లేదు. కాని ఈసారి బయలుదేరిన వ్యాన్‌కి ఒక ప్రత్యేకత వుంది.

మొదటిసారిగా పోలీసులది టెర్రరిస్టులపై

## తెల్లమచ్చలకు చికిత్స

కొత్త పరిశోధన! తెల్లమచ్చలు, ఇతర చర్మవ్యాధులు వున్నవాళ్ళు బాధపడనవసరం లేదు. అట్టి వాటి వివరాలు ఇంగ్లీషులో తెలిపి రెండు చిన్న సీసాల మందు ఉచితంగా పొందండి. మా మందు వాడడం మీరు ప్రారంభించగానే మీ తెల్లమచ్చలు మాయమవడం ప్రారంభమగును. చాలా మంది ఈ విధమైన నివారణ పొందారు. మీరూ ప్రయత్నించి లాభం పొందండి. అర్హతలు, అనుభవం వున్న వైద్యుని ద్వారా చికిత్స పొందండి.

**Vaidya M K Mathur (MKT)**

**Po. Katri Sarai, Gaya**

## తెల్ల వెంట్రుకలు

హేర్ డైతో కాదు. మా ఆయుర్వేద నూనెతో చిన్న వయస్సులో వెంట్రుకలు తెల్లబడడం ఆటంకపరచవచ్చును. మొదలు నుండే నల్లజుట్టు రావడం మొదలై జుట్టుని తెల్లబడనీయకుండా కాపాడును. ఈ నూనె కళ్ళకి, మెదడునకు లాభదాయకమైనది. వేలమంది లాభం పొందారు. ఈ చికిత్స ద్వారా మీకు ఫలితం దక్కనిచో మీ డబ్బు వాపస్ ఇవ్వబడును. ఒకసారి ప్రయత్నించండి. ఒక చిన్న సీసా వెల రూ. 25/-. మూడు సీసాల వెల రూ. 70/-. మూడు సీసాలకి ఒకేసారి ఆర్డర్ ఇస్తే ఒక సీసా ఉచితం.

**Vaidya M K Mathur (MKT)**

**Po. Katri Sarai, Gaya**


పైచేయి అయింది. అందునా అందర్నీ ప్రాణాలతో పట్టుకోవడం డిపార్టుమెంటుకి గర్వించదగిన విషయమే!

అందరూ ఆ ఆనందంలో వుండగానే, మల్లయ్య ముఖంమీద పిడిగుద్దు పడింది.

అతని పెదిమ చిట్లి రక్తం చివ్వున చిమ్మింది. తనని కొట్టింది ఇన్‌స్పెక్టర్ అని అర్థం చేసుకునే లోపే అతని ముఖం మీద మరో పిడిగుద్దు పడింది.

"చెప్పు – పటేలు కూతుర్ని మానభంగం చేసి, చంపింది నువ్వేగా!" ఇన్‌స్పెక్టర్ హూంకరించాడు.

మల్లయ్య కాదన్నట్టు తల అడ్డంగా వూపాడు. "పోలీసు జీపు కింద మందు పాతర పెట్టింది కూడా నువ్వే కదూ!" ప్రశ్న వెంట ప్రశ్న వేశాడు ఇన్‌స్పెక్టర్.

ఈసారీ తల అడ్డంగా వూపాడు మల్లయ్య.

"యూ స్కౌండ్రల్! చేసిన నేరాల్ని ఒప్పుకోక, తల అడ్డంగా ఆడిస్తున్నావా? ఏం చూసుకునిరా నీ ధైర్యం?" ఇన్‌స్పెక్టర్ పిడికిలి బిగించి మరోసారి చెయ్యి పైకెత్తాడు.

కాని అప్పటికే ఎవ్వరూ వూహించని విధంగా "ఢాం" అని పోలీసు వ్యాన్ క్రింద మందు పాతర పేలిపోయింది.

వ్యాన్ తునాతునకలయింది. పోలీసులతో పాటు, మల్లయ్య, అతని సహచరులు చెల్లాచెదురయ్యారు. నల్లని పొగ ఆ ప్రదేశం అంతా దట్టంగా వ్యాపించింది.

"శత్రుశేషం, రుణశేషం వుండకూడదంటారు. పోయి చూడండిరా, మల్లయ్యగాడు చచ్చేడో లేదో!" తన సహచరులను చెట్టుచాటునుండి హెచ్చరించాడు పటేలు.

కాని అతనూహించినట్టు మల్లయ్య చావలేదు. అతను కొన ప్రాణంతో గిలగిల కొట్టుకుంటున్నాడు. మరోమూల తల పగిలి, కాళ్ళు తెగిపడిన ఇన్‌స్పెక్టర్ స్పృహలోకి వచ్చాడు.

అతని చూపులు సరిగ్గా పటేలు మీద నిలిచాయి. అతని గురి తప్పలేదు. మెషిన్ గన్ ట్రిగ్గర్ నొక్కటం, నిప్పులు కురుస్తూ బులెట్లు పటేలు గుండెల్ని చీల్చుకుపోవడం అంతా క్షణంలో జరిగిపోయింది.

అంతిమ విజయం తననే వరించినా ఆఖరి క్షణాల్లో వున్న పోలీస్ ఆఫీసర్ తను తెలుసుకోవాల్సిన విషయం మరచిపోలేదు. అతని పెదవుల మీద అవే ప్రశ్నలు మరల మరల కదిలాయి.

"పటేలు కూతుర్ని పాడుచేసి చంపింది నేను కాదు. నరసింహ. అందుకే వాడికా శిక్ష వేశాను. మందుపాతర పెట్టి పోలీసులను చంపింది నేను కాదు. ఆ ఘోరం ఎవరు చేశారో నాకు తెలియదు" అని సత్యం పలకడం వరకే మల్లయ్యకు తెలుసు.

పటేలే ఆ పని చేసి పోలీసులను తన మీధకు ఉసికొలిపినట్టు తనకు వున్న అనుమానాన్ని మాటమాత్రంగానైనా వ్యక్తం చేయని మల్లయ్య నిజాయితీకి ఇన్‌స్పెక్టర్ కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అభినందనగా మల్లయ్య భుజమ్మీద చేయి వేశాడు.

ఇన్‌స్పెక్టర్ తన నిజాయితీని గుర్తించాడన్న సత్యం తెలుసుకోకముందే మల్లయ్య ప్రాణాలు అనంతవాయువుల్లో కలసిపోయాయి. మల్లయ్య తీర్పు ఆవేశంతో కూడినది కాదు, ఆలోచన లోంచి పుట్టిందని తెలుసుకోవడానికి బహుశ మనిషి అన్నవాడు మనీషిగా మారాలేమో!

ఆ విషయం గుర్తించిన పోలీస్ ఇన్‌స్పెక్టర్ అప్పటికే విగత జీవి అయ్యాడు.

ధర్మాధర్మాల మధ్య జరిగిన నరమేధంలో అంతిమ విజయం ఎప్పుడూ ధర్మానిదే!

ఇప్పుడు ఆ వూరి గిరిజనులకు అన్నల అవసరం లేదు. ఈ పోలీసులు, చట్టాలు, న్యాయస్థానాల అవసరం అసలేలేదు.

కారణం ఇప్పుడా గిరిజనవాడలో ఎవ్వరూ ఏ తప్పూ చేయరు. అలా అని నమ్మకమేమిటని సభ్యసమాజం అడగొచ్చు.

అలా అని చనిపోయిన మల్లయ్య మీద ఆ వూరి గిరిజనులు ప్రమాణం చేశారు.

అది వాళ్ళ నమ్మకమనే కంటే, మల్లయ్య ఇచ్చిన తీర్పు మరి ఏ ఇతర పీనల్ కోడ్‌లోనూ లేదన్నది వాస్తవం గనుక.

---

* డోసుబాబు తన మిత్రుడైన బ్రాందీబాబుతో "నిన్న త్రాగిన మైకంలో ఇంటికెళితే మా ఆవిడ అప్పడాల కర్రతో నా తలమీద బాదింది. ఎనిమిది కుట్లు పడ్డాయి! ఆ తరువాత చాలా బాధపడిందిరా!" అన్నాడు.

"నిజంగా బాధపడితే మంచిదేకదరా" అన్నాడు బ్రాందీబాబు!

"ఆ రోజే కొన్న అప్పడాల కర్ర విరిగితే బాధపడదూ".

– మానస

